పిలిచిన వెంటనే
పేరంటానికి వచ్చే
అమ్మ
ఈ రోజు రాదేమిటి?

తల్లి
రాజగోపాల్
కథ

# అమ్మా, పేరంటానికి పోదాం రావే!

"అమ్మా, అమ్మా" అని అరుచుకుంటూ ఇంట్లోకి పరుగెత్తుకు వచ్చాడు కృష్ణుడు. అప్పడాలు వత్తుతున్న జానకి 'ఏంటిరా' అన్నట్లుగా చూసింది కొడుకువంక. కృష్ణుడు వగరుస్తూ "అనసూయగారింటికి అందరూ పేరంటానికి వెళ్లిపోతున్నారే! మనమూ వెళ్దాం తొరగారా" గబగబా చెప్పాడు.

"తొందరేం లేదు వెళ్దాంగానీ, ముందీ అప్పడాలు పూర్తవనీ" అంది జానకి. కొడుకు ఆతృతకి చిన్నగా నవ్వుకుంటూ. "తొందరగా రామ్మా, అనసూయగారు పిన్నడిగారు" అన్నాడు కృష్ణుడు.

ఆ మాట విన్న జానకి చేస్తున్న పని మధ్యలో ఆపి, చేతులు కడుక్కొని అత్తగారితో పేరంటానికి వెళ్తున్నానని చెప్పి 'పద' అని కొడుకుతో బయలుదేరింది.

కృష్ణుడికి ఏనుగెక్కినంత సంబరంగా అనిపించింది. తల్లి ఇప్పుడిప్పుడే రాదేమోనన్న అనుమానం వాడికింతవరకూ కలిగింది. తల్లిమధ్యలో పని ఆపి పేరంటానికి బయలుదేరడంతో వాడికి చాలా సంతోషం కలిగింది

కృష్ణుడికి ఏడేళ్లు. సరైన పోషణ లేక బలహీనంగా కనిపించినా చలాకీగా ఉంటాడు. వాడి చొక్కా భుజం దగ్గర, నిక్కరు వెనక పిరుదులదగ్గర అతుకువేసి వుంటుంది. వాడికి తల్లి అంటే చాలా ఇష్టం ఆమె ఎవరింటికి వెళ్లినా, ఏ పేరంటానికి వెళ్ళినా కూడా తనూ వెళ్తుంటాడు. తల్లికి తాంబూలం ఇస్తూ వాడి చేతిలో కూడా ఏ అరటిపండో, లేక సెనగలో పెడుతుంటారు. అవంటే వాడికి చాలా ఇష్టం.




తల్లి అలా పేరంటానికి వెళ్ళబట్టే తనకివన్నీ దక్కుతున్నాయని కృష్ణుడి నమ్మకం

జానకి పేరంటానికి వెళ్ళొచ్చి మళ్లీ అప్పడాలు వత్తడం మొదలుపెట్టింది.

అత్తగారు అడిగింది— ''ఏంటి విశేషం?'

''అనసూయగారమ్మాయి కన్యకాపరమేశ్వరి వ్రతం చేసుకుంటోంది'' అంది జానకి.

''ఎందుకు?'' అనడిగింది అత్తగారు.

''పెళ్లి ఆలస్యం అవుతోందని...''

''పాపం ఆ పిల్లకు ఎన్ని సంబంధాలొచ్చినా ఒక్కటీ కుదరడం లేదు కదూ!'' అందావిడ.

జానకి అంటే ఆ చుట్టుపక్కల ఇళ్లవాళ్లకి ప్రత్యేకాభిమానం. ఆమె ఉన్నదాంట్లోనే శుభ్రంగా వుంటుంది. నుదుటన కుంకుమ బొట్టు కాస్తంత పెద్దదిగా పెట్టుకుని నిండు ముత్తయిదువలా వుంటుంది. అందులో సెంటిమెంట్‌గా జానకి ఎదురు మంచిదని ఆమె చెయ్యి మంచిదని ఆ వీధిలో వాళ్ల నమ్మకం.

అందుకే ఏదైనా ముఖ్యమైన పనిమీద వెళ్లేటప్పుడు జానకిని ఎదురు రమ్మంటారు. ఎవరైనా పూజలు, వ్రతాలు చేసుకున్నప్పుడు మొదటి వాయనం ఆమెకు ఇస్తుంటారు.

జానకి అప్పడాలు, ఊరగాయలు పెట్టి అమ్ముతుంటుంది. ఆమె భర్త రంగారావు ఖర్చు మనిషి. అతని సంపాదనంతా తాగుడికే సరిపోదు. అది చాలక ఇంటికి వచ్చి గొడవచేసి ఆడవాళ్ల సంపాదన ఎత్తుకుపోతుంటాడు.

అందుకే కృష్ణుడికి తండ్రంటే చాలా కోపం. వాడికి తండ్రంటే అసలు ప్రేమలేదు. రంగారావు కూడా కొడుకుని ఎంతసేపూ కసురుకున్నట్టే ఉంటాడు. ఒరే అది పట్రా, ఇది పట్రా' అని పనులు చెప్పడం తప్పించి కొడుక్కి ఓ పావలా అయినా ఇవ్వడు.

కేవలం అందుకే కృష్ణుడికి తండ్రంటే కోపం కాదు. తండ్రి నానమ్మను తిట్టడం, తల్లిని కొట్టడం వాడెన్నోసార్లు చూశాడు. అందుకే వాడికి తండ్రంటే మహా చిరాకు. వాడికి తండ్రంటే గౌరవం, ప్రేమ, భక్తి కొంచెం కూడా లేవు.

''అమ్మా, అమ్మా'' అంటూ కృష్ణుడు ఇంట్లోకి పరుగెత్తుకు వచ్చాడు. పొయ్యిమీద నుండి అన్నం దింపి వార్చుతున్న జానకి ''ఏంటిరా'' అనడిగింది నవ్వుతూనే. వాడు అంత హడావుడిగా పరుగెట్టుకు వచ్చాడంటే ఎవరో తనని రమ్మనమని పిలుస్తున్నారని ఆమెకు తెలుసు. తనుకూడా వచ్చినప్పుడు వాడికి చిరుతిండి దొరుకుతుందన్న ఆశ వాడి ఉత్సాహానికి కారణమని ఆమెకు తెలుసు.

కృష్ణుడు జారిపోతున్న నిక్కరును ఓ చేత్తో పైకి లాక్కుంటూ ''మరే రాధమ్మగారమ్మాయి వెళ్ళిపోతుందంటా! నిన్ను రమ్మన్నారు!'' అని చెప్పాడు కళ్లు చక్రాల్లా తిప్పుతూ.

జానకి చేతులు చీరకొంగుకి తుడుచుకుని రాధమ్మ ఇంటికి వెళ్లింది. వెనకాలే— తల్లి ఆవు వెనక దూడలా కృష్ణుడు నడిచాడు.

జానకిని చూసి రాధమ్మ ఆప్యాయంగా పలకరించింది. ''రా, రా వంటయ్యిందా!'' అనడిగి ''అంజలి వెళ్లిపోతోంది'' అంది.

''అదేం ఇంకో వారం ఉంటానంది కదా! ఇంతలోనే...''

''ఇదక్కడ లేక అల్లుడిగారికి భోజనానికి చాలా ఇబ్బందిగా ఉంటోందట!'' అంది నవ్వుతూ రాధమ్మ. జానకి ఆమె నవ్వుతో శ్రుతి కలుపుతూ ''అందుకని వెంటనే రమ్మని ఉత్తరం రాశారా'' అంది.

"ఉత్తరం కాదు. ఏకంగా ఆయనే వచ్చారు" నవ్వుతూ చెప్పింది అంజలి.

అంజలి, ఆమె భర్త ఆటోలో స్టేషన్‌కి వెళ్తుంటే జానకి చేతిలో నీళ్ల చెంబుతో ఎదురొచ్చింది. అంజలి వెళ్తూ వెళ్తూ "వెళ్లొస్తాన్ జానకక్కా" అని చెప్పడంతో "మంచిదమ్మా" అంది జానకి.

కృష్ణుడికి ఇదంతా చాలా సంబరంగా వుంది. అంత గొప్పోళ్లు తల్లిని అలా ప్రేమగా పలకరిస్తుంటే భలేగా వుంటుంది.


వాడి దృష్టిలో తల్లంటే చాలా గొప్ప వ్యక్తి. చాలా ప్రత్యేకమైన మనిషి. అందుకే అందరికీ తల్లో నాలుకలా వుంటుంది. ఆ వెంటనే వాడికి తండ్రి గుర్తొచ్చాడు. తాగొచ్చి తల్లిని కొట్టే సీను వాడి కళ్లముందు కదిలేసరికి వాడి ముఖం కోపంగా మారి ఎర్రగా కందిపోయింది.

అంజలి వెళ్లిపోయిన తర్వాత రాధమ్మ జానకిని ఇంట్లోకి పిలిచి కూతురు కోసం చేసిన లడ్డూల్లో ఓ రెండు జానకి చేతిలో పెట్టింది. 'మరి నాకేది' అన్నట్లుగా చూస్తున్న కృష్ణుడి కేసి నవ్వుతూ చూసి "ఇదిగోరా కిష్టుడూ, నువ్వీ బూందీ తిను" అంటూ వాడి చేతిలో తీపి బూందీ పెట్టింది రాధమ్మ.

కృష్ణుడు ఆనందో బ్రహ్మ అయ్యాడు. ఇంటి దగ్గర ఎలాగూ ఆ లడ్డూలో వాటా తనకిస్తుంది తల్లి. ఇక్కడ తన మామూలు వసూలైపోయింది.

ఆ రాత్రి రంగారావు తాగొచ్చి జానకిని పదిరూపాయలిమ్మని అడిగాడు. అది విన్న జానకి అత్తగారు "సిగ్గులేదట్రా అడగడానికి . నువ్వు సంపాదించేది ఇంట్లో పైసా ఇవ్వవు. అయినా అదేం అడక్కుండా ఆ బిడ్డ ఏదో కష్టపడి నాలుగు డబ్బులు సంపాదించి గుట్టుగా సంసారం లాక్కొస్తోంది. మళ్లీ దాన్ని డబ్బులడిగితే ఎక్కడ్నుంచి తెస్తుందిరా అది" అని తిట్టింది కొడుకుని.

"నువ్వు నోర్మూయ్యవే ముసలీ" అని



## ప్రేమ

గోపీని అనహావంగా అడిగింది రాధ.

"అస్తమానూ – 'నిన్ను ప్రేమిస్తున్నాను... ప్రేమిస్తున్నాను' అంటావేగాని పెళ్ళిమాట ఎత్తవేం..."

"పెళ్ళి చేసుకుంటే – యిక ప్రేమించేదేం వుంది..."

"ఆ...!"

–జంగారెడ్డి వెంకటరమణ (లక్కవరం)

తల్లిని కసిరి "దీని దగ్గర డబ్బులుండవంటే నమ్మడానికి నేనంత వెర్రి ఎదవనేంటి!" అని "తొరగా ఇవ్వవే కిక్కు దిగిపోయింది. మళ్ళీ వేసుకోవాలి" అవడిగాడు.

జానకి బెదురుతూనే "నిజంగా నా దగ్గర డబ్బుల్లేవండీ. ఉన్నదాంట్లో ఇందాక బియ్యం తెప్పించి అన్నం వండాను. సావిత్రమ్మగారు అప్పడాల డబ్బులు రేపిస్తానన్నారు' అంది.

"ఛీ! దొంగముండా! అబద్దాలు చెపుతావా! మొగుడితో అబద్ధాలు చెప్పే నువ్వేం పతివ్రతవే" అవరుస్తూ ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా కాళ్లతో తన్ని, భార్యను నాలుగు బాదాడు.

జానకి ఆ దెబ్బల్ని మౌనంగా భరించి గుడ్లనీరు కుక్కుకుంది. ఇదంతా ఓ పక్కనుంచి చూస్తున్న కృష్ణుడికి తండ్రి పీక పిసికెయ్యాలన్నంత కోపం వచ్చింది. తండ్రంటే వాడికి రోజురోజుకి అసహ్యం పెరిగిపోతోంది. వాడి దృష్టిలో తండ్రి ఉన్నా లేనట్లే. వాడప్పుడు అనుకున్నది ఒక్కటే— తండ్రి చచ్చిపోతే బావుండునని.

ఓరోజు ఘోరం జరిగిపోయింది. తాగి రోడ్డుపై అడ్డంగా నడుస్తున్న రంగారావుని లారీ గుద్ది అక్కడికక్కడే మరణించాడు.

జానకి భర్త శవం మీదపడి భోరున విలపించసాగింది. చూసేవాళ్లకి ఆమె ఏడుపు హృదయాల్ని కదుపుతోంది. ఆమెకు జరిగిన అన్యాయానికి చుట్టుపక్కలవాళ్లు కన్నీళ్లు పెట్టుకున్నారు. రంగారావు తల్లి స్పృహతప్పి పడిపోయింది.

కాని కృష్ణుడు మాత్రం ఏడ్వడం లేదు. వాడికసలు తండ్రి చనిపోయినందుకు రవ్వంత బాధకూడా కలగడం లేదు. రోజూ వచ్చి తనని కొట్టే మనిషి కోసం తల్లి ఎందుకు అలా ఏడుస్తుందో వాడి చిన్న బుర్రకు అర్థం కావడం లేదు.

వాడికి తెలిసిందల్లా ఒక్కటే. ఇకనుండి తల్లి, నానమ్మ, తను సుఖంగా ఉండొచ్చు. వాడికి తండ్రి పీడ విరగడయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇకనుండి నానమ్మని తిట్టేవారుండరు. అమ్మని కొట్టేవారులేరు. అదే వాడి సంతోషానికి కారణం.

వాడి జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది.

"అమ్మా, అమ్మా" అని అరుచుకుంటూ జారిపోతున్న నిక్కరుని ఎగదీసుకుంటూ ఇంట్లోకి పరుగెట్టుకు వచ్చాడు కృష్ణుడు. ఊరగాయ పెడుతున్న జానకి 'ఏంటిరా' అన్నట్టుగా చూసింది.

"పరమేశ్వరమ్మగారింట్లో పేరంటానికి అందరూ వెళ్తున్నారు. తొరగా రా మనమూ వెళ్దాం" అన్నాడు.

జానకి ఏం మాట్లాడకుండా ఊరగాయ పెట్టసాగింది. తల్లి తన మాట వినవట్లుగా పనిలో మునిగిపోవడం చాలా ఆశ్చర్యం కలిగించింది కృష్ణుడికి. ఎప్పుడూ లేనిది తల్లేంటి కొత్తగా ప్రవర్తిస్తోంది అనిపించింది వాడికి.

కృష్ణుడికి ఏడుపొచ్చింది. "ఏంటమ్మా అలా కూర్చున్నావ్? తొరగారా పేరంటానికి వెళ్దాం" అని బతిమాలాడు.

జానకి మౌనంగా కన్నీళ్ళు కార్చసాగింది. తను పేరంటానికి రమ్మంటే రాకుండా తల్లి ఎందుకు ఏడుస్తోందో కృష్ణుడికి అర్థం కాలేదు. "ఏంటమ్మా ఇంకా అలా కూర్చు

స్నాన్! తొరగా చెయ్యి కదుక్కురా'' అని తల్లి జబ్బపట్టుకుని లేపబోయాడు.

ఇదంతా చూస్తున్న జానకి అత్తగారు దీర్ఘంగా నిట్టూర్పు విడిచి "ఒరే కిట్టయ్యా, మీ అమ్మ ఇకనుండి పేరంటానికి వెళ్లదురా' ' అంది.

ఆ మాటలు వినేసరికి కృష్ణుడికి నానమ్మ మీద చాలా కోపం వచ్చింది. నానమ్మే కావాలని తల్లిని ఎక్కడికి వెళ్లనివ్వకుండా చేస్తుందని వాడికి అనిపించింది.

"ఏం ఎందుకు వెళ్లదు?'' కోపంగా అడిగాడు.

"వెళ్లకూడదురా'' "ఎందుకు వెళ్లకూడదు? ఇన్నాళ్లూ వెళ్లింది కదా!'' అమాయకంగా గొంతులో జీరతో అడిగాడు. వాడికి ఏడుపు తన్నుకొచ్చేస్తోంది.

జానకి అత్తగారికి వాడికెలా చెప్పాలో అర్థం కాలేదు. చెప్పకపోతే వదిలేలా లేదు.

"ఏం మాట్లాడవేం! మా అమ్మ పేరంటానికెందుకెళ్లకూడదు?'' విసురుగా అడిగాడు కృష్ణుడు.

"ఎందుకంటే, మీ నాన్న చచ్చిపోయాడు కాబట్టి'' చెప్పలేక చెప్పింది ఆ ముసలావిడ ఏడుస్తూ.


ఆ మాట విన్న కృష్ణుడికి మతిపోయినట్లైంది. వాడింకా ఆ మాటలు నమ్మలేకపోతున్నాడు. నాన్న చచ్చిపోతే ఇకనుండి సుఖంగా ఉండొచ్చు అనుకున్నాడుగాని, ఇలా తన సుఖానికి, ఆనందానికి, సంతోషానికి గండపడుతుందని వాడి ఊహకు కూడా తట్టలేదు. వాడికిప్పుడు ఒకటొకటే జ్ఞాపకం రాసాగాయి.

అందుకేనా ఈ మధ్య ఎవరూ అమ్మని ఎదురు రమ్మనికూడా పిలవడం లేదు. వాడి సుందర స్వప్నం చెదిరిపోయింది. వాడి రంగుల ప్రపంచం కరిగిపోయింది.

వాడికిప్పుడు తండ్రి చనిపోయినందుకు మొదటిసారిగా దుఃఖం కలిగింది. అప్పుడొచ్చింది, వాడి నోటినుండి "నాన్నా! ఎందుకు చచ్చిపోయావ్ నాన్నా!'' అన్న కేకతో పాటు ఏడుపు.

*

## అమెరికాలో కూడా...



మన దేశంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ లీలలు చెప్పుకుంటే కోకొల్లలు! అయితే అమెరికాలో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయట!

*1908 జనవరి 7వ తేదీన పోస్ట్‌చేసిన ఓ ఉత్తరం 1976 ఫిబ్రవరి 3వ తేదీన అంటే 68 సంవత్సరాల తర్వాత అందిందట! అమెరికాలోని మిచ్‌గన్‌కు చెందిన లార్సెగాషోకు ఆతని తాతగారు వ్రాసిన ఉత్తరమది! కళ్ళెదురుగా తాతగారు లేకపోయినా... ఆయన వ్రాసిన ఉత్తరం చూసి కాసేపు సంతోషించాడట గాషో! అంతేమరి... అలా సంతోషపడక మరేం చెయ్యగలడు!?*

—బూపీటర్